సాక్షి నిజామాబాద్

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



మెడికల్ షాపుల్లో వసూళ్లు

డ్రగ్స్ విభాగం అధికారులకు ఇవ్వడానికంటూ అసోసియేషన్ ప్రతినిధులు మెడికల్స్‌లో డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

- 8లో ▸



పెరిగిన ఎఫ్‌ఏల జీతం

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు రూ. 8,900 నుంచి రూ. 11,570కి పెరిగాయి. 320 మంది ఎఫ్‌ఏలకు లబ్ధి చేకూరనుంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.7 /23.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం చలి పెరుగుతుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్ పరిశీలన



సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం పరిశీలించారు. ఈవీఎంలను భద్రపర్చిన గోడౌన్ సీల్‌ను గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఎన్నికల సామగ్రి భద్రపరిచిన గదులను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకుని, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాకు వీవీ ప్యాట్లు, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు అన్నీ కూడా కొత్త వాటిని కేటాయించారని ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

సదరం తేదీలు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఈనెలలో నిర్వహించనున్న సదరం క్యాంపులకు తేదీలు ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి చందర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 18 తేదీల్లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సదరం క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. క్యాంపునకు హాజరయ్యేవారు ఈ నెల 10న ఉదయం 11:30 గంటలకు మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. మొత్తం 260 స్లాట్లు అందుబాటులో ఉంచనున్నామని, స్లాట్‌లో సూచించిన రోజున సదరం క్యాంపునకు మెడికల్ రిపోర్టులు, తగు ధ్రువపత్రాలు వెంట తీసుకుని రావాలని సూచించారు.

టార్గెట్ పూర్తి చేయాలి



ఖలీల్‌వాడి: ఆర్టీసీ ప్రవేశపెట్టిన 100 రోజుల టార్గెట్‌ను పూర్తి చేయాలని డిప్యూటీ ఆర్‌ఎం సరస్వతి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో–1లో ఉద్యోగులతో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీకి ఆదాయం పెంపొందించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలను వివరించారు. టార్గెట్‌ను పూర్తి చేసేందుకు సిబ్బంది సహకరించాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలను చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమన్నారు. సమావేశంలో డిపోమేనేజర్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం



సుభాష్‌నగర్: తన తల్లి ఉద్యోగం తనకు ఇప్పించాలని కోరుతూ నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన లత కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన ఆమె బయటికి వచ్చి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించింది. స్థానికులు, పోలీసు సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. తన తల్లి విజయలక్ష్మి గతంలో కలెక్టరేట్‌లో స్వీపర్‌గా పని చేసిందని, ఆమె ఉద్యోగం తనకు ఇప్పించాలని ఈ సందర్భంగా లత కోరింది. ఉద్యోగంకోసం ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపింది. రూరల్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై మహేశ్ అక్కడికి చేరుకొని లతను అదుపులోకి తీసుకున్నారు. కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్‌ను వివరణ కోరగా.. లతకు కలెక్టరేట్ లో ఏజెన్సీ ద్వారా ఉద్యోగం ఇప్పించామని, విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో ఆమెను తొలగించారని తెలిపారు. ఆమె తల్లికి ఉద్యోగానికి సంబంధించిన ఎలాంటి ఆర్డర్‌కాపీ లేదన్నారు.



ఇక బ్యాలెట్ పోరు..

మోగిన నగారా..

- అటు కోడ్.. ఇటు రాజకీయ వేడి
- శాసన సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ..
- టిక్కెట్ల ఖరారుతో ముందు నుంచే బీఆర్‌ఎస్ సిట్టింగ్‌ల ప్రచారం
- కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల్లో టిక్కెట్ల ఉత్కంఠ
- అక్టోబర్ 3న విడుదలకానున్న నోటిఫికేషన్ గెజిట్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో నాలుగు రాష్ట్రాలతో కలిపి షెడ్యూల్ ప్రకటించింది. దీంతో తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. పోలింగ్‌కు 50 రోజుల సమయంతో కౌంట్‌డౌన్ షురూ అయింది. పార్టీల ప్రచారానికి 49 రోజుల సమయం ఉంది. వచ్చే నెల 3న భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ గెజిట్ విడుదల చేయనుంది. నవంబర్ 10 వరకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కావడంతో ఆయా పార్టీలు ఒక్కసారిగా అలర్ట్ అయ్యాయి.

ఇప్పటికే టిక్కెట్లు ఖరారైన జిల్లాకు చెందిన అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటి వరకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం, శంకుస్థాపనలు చేయడంతో బిజీబిజీగా గడిపారు. మరోవైపు ఎన్నికల ప్రచారం సైతం చేస్తూ వచ్చారు. జిల్లాలో ఆర్మూర్, బాల్కొండ బీఆర్‌ఎస్ సిట్టింగులైతే ఏకంగా తాయిలాలు పంచుతూ వస్తున్నారు. ఈ క్రమంలో కోడ్ అమలులోకి రావడంతో అలర్ట్ అయ్యారు.

కొలిక్కి రాని కాంగ్రెస్, బీజేపీ టిక్కెట్లు

ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీల్లో టిక్కెట్ల ఖరారు కొలిక్కి రాకపోవడంతో ఆయా పార్టీల టిక్కెట్ల ఆశావహులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. రెండూ జాతీయ పార్టీలు కావడంతో ఢిల్లీ స్థాయి వరకు ఆశావహులు తమ లాబీయింగ్‌ను చేసుకుంటూ వచ్చారు. మరోవైపు పార్టీల నాయకత్వాలు సర్వేలను ప్రామాణికంగా తీసుకోవడంతో పాటు, ప్రత్యర్థుల బలాలను సైతం బేరీజు వేసుకుంటున్నాయి. రెండు పార్టీల టిక్కెట్ల విషయమై జాతీయ నాయకత్వాలు పకడ్బందీగా వ్యవహరిస్తుండడంతో రాష్ట్ర నాయకత్వాలు సైతం పూర్తిస్థాయిలో ఆశావహులకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్‌లో..

- నిజామాబాద్ అర్బన్ స్థానంలో కాంగ్రెస్ టిక్కెట్టు కోసం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ మధ్య తీవ్ర పోటీ ఉంది.
- నిజామాబాద్ రూరల్‌లో మాజీ ఎమ్మెల్సీ రేకులపల్లి భూపతిరెడ్డి, కాటిపల్లి నగేశ్‌రెడ్డి పోటీ పడుతున్నారు.
- ఆర్మూర్‌లో పొద్దుటూరి వినయ్‌రెడ్డి, గోర్త రాజేందర్ మధ్య పోటీ ఉంది.
- బాల్కొండలో ముత్యాల సునీల్‌రెడ్డికి, బోధన్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి ఖరారైనట్లు తెలుస్తోంది.

బీజేపీలో..

- బీజేపీ టిక్కెట్ల కోసం సైతం పోటీ నెలకొంది.
- నిజామాబాద్ అర్బన్ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ మధ్య ఉంది.
- బోధన్‌లో మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి మధ్య పోటీ నెలకొంది.
- నిజామాబాద్ రూరల్‌కు కులాచారి దినేశ్, ఆర్మూర్‌కు పైడి రాకేశ్‌రెడ్డి, బాల్కొండకు ఏలేటి అన్నపూర్ణమ్మ ఖరారైనట్లు తెలుస్తోంది.

జిల్లాలోని నియోజకవర్గాల్లో వయస్సుల వారీగా ఓటర్ల వివరాల పట్టిక..

	పోలింగ్ స్టేషన్లు	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80-89	90-99
ఆర్మూర్	217	7,064	41,582	52,725	40,478	32,089	19,336	10,099	2,555	401
బోధన్	246	6,320	44,839	56,498	41,934	33,184	19,984	10,102	2,637	443
బాన్సువాడ	258	6,265	41,271	54,007	35,757	27,946	16,952	8,286	2,024	297
నిజామాబాద్ అర్బన్	289	7,388	60,547	77,013	58,013	42,459	24,374	13,537	3,024	378
నిజామాబాద్ రూరల్	293	6,947	50,079	68,870	48,891	36,858	22,581	11,079	2,578	371
బాల్కొండ	246	7,035	43,916	56,876	42,094	32,897	20,254	9,826	2,333	322
జిల్లా మొత్తం	1,549	41,019	2,82,234	3,65,989	2,67,167	2,05,433	1,23,481	62,929	15,151	2,212

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి



వీసీలో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

సుభాష్‌నగర్: ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. ఎలక్షన్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ భవనాల్లో ఉన్న రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగ్‌లు, వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలు, ఫొటోలను 24 గంటల వ్యవధిలో, పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద ఉన్న వాటిని 48గంటల్లో, ప్రైవేట్ స్థలాల్లో ఉన్న వాటిని 72గంటల్లో తొలగించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర, జిల్లా ప్రభుత్వశాఖల వెబ్‌సైట్‌లలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను తొలగించాలన్నారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులను నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీ చేయాలని సూచించారు. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ఏర్పాటు, ఎన్నికల విధుల నిర్వహణ సిబ్బంది శిక్షణ, తదితర కార్యక్రమాలు పూర్తి చేయాలని, సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల మ్యాపింగ్ వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, లైటింగ్, ర్యాంపు, నీటి సరఫరాతో కూడిన టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదేరోజు అందించే విధంగా ఎంసీఎంసీ పని చేయాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, సీపీ

విస్తృతంగా వాహనాల తనిఖీ



ఎలక్షన్‌కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు సోమవారం జిల్లా వ్యాప్తంగా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. కమ్మర్‌పల్లిలో ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.5.40లక్షల నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.

- సాక్షి న్యూస్‌నెట్‌వర్క్

అమల్లోకి ఎలక్షన్ కోడ్

- అనుమతుల్లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దు
- 80 ఏళ్లపైబడిన, దివ్యాంగుల కోసం 'ఓట్ ఫ్రమ్ హోం'
- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ సోమవారం నుంచే అమల్లోకి వచ్చిందని, డిసెంబర్ 5 వరకు అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్, సీపీ మాట్లాడారు. ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్ సహా జిల్లాలో మొత్తం ఆరు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దని, నిర్వహించాల్సి వస్తే తప్పనిసరిగా ముందస్తుగా రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందాలని సూచించారు. జిల్లాలో ఎంసీఎంసీ, సోషల్ మీడియా బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ఆరు నియోజకవర్గాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, వీడియో సర్వేలైన్స్ బృందాలు పనిచేస్తాయని వివరించారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల వ్యయ పరిశీలకుల బృందాలు ఏర్పాటు అవుతాయని తెలిపారు. కోడ్ ఉల్లంఘించే వారిపై నిబంధనల మేరకు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కోడ్ ఉల్లంఘనపై ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని, ఈసారి కొత్తగా సీ-విజిల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో తెచ్చిందని, యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు లైవ్ ఫొటోలు, వీడియోలు తీసి ఈసీ దృష్టికి తీసుకురావొచ్చని సూచించారు.

ఇంటి నుంచే ఓటు..

80ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుందని కలెక్టర్ తెలిపారు. 'ఓట్ ఫ్రం హోమ్' ప్రకారం ఎన్నికల ప్రకటన వెలువడిన ఐదు రోజుల్లోపు 12–డీ ఫారం భర్తీ చేసి బీఎల్‌ఓలకు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 18 నుంచి 19ఏళ్ల కలిగిన యువఓటర్లు 41,019 మంది, 80 ఏళ్లపైబడిన ఓటర్లు 17,363 మంది, దివ్యాంగ ఓటర్లు 23,934 మంది ఉన్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో మహిళలకు ఐదు, యువతకు, వృద్ధులకు, దివ్యాంగులకు ఒక్కోటి చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపేక్షించేది లేదు

ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని సీపీ సత్యనారాయణ స్పష్టం చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, మైక్రో అబ్జర్వర్స్ పరిశీలిస్తారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పని చేస్తాయన్నారు. సాలూరా, కందకుర్తి, ఖండ్‌గావ్, పోతంగల్‌లో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 200 మందిపై రౌడీషీట్ తెరుస్తున్నామని, ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేశామన్నారు. మొత్తం 75 మందిలో ఇప్పటికే 35 మందికి చెందిన లైసెన్స్‌డ్ తుపాకులను సీజ్ చేశామని, త్వరలోనే బ్యాంకు సెక్యూరిటీ మినహా మిగతా తుపాకులను స్వాధీనం చేసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

బోధన్ వరకు రైలు పొడిగింపు



జెండా ఊపుతున్న చైర్‌పర్సన్ తూము పద్మ

బోధన్: కరీంనగర్ – నిజామాబాద్ మధ్య నడిచిన రైలును బోధన్ వరకు పొడిగించారు. పొడిగించిన రైళ్లతోపాటు బోధన్‌రైలును సికింద్రాబాద్‌లో కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. రైల్వేశాఖ అధికారులు బోధన్‌లోని రాకాసీపేట్ రైల్వేస్టేషన్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, రైల్వేశాఖఅధికారులు పచ్చజెండా ఊపి రైలును ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 4.15గంటలకు బోధన్ నుంచి రైలు బయల్దేరుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి –నిజామాబాద్ మధ్య నడుస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను బోధన్ వరకు పొడిగించాలని, ఇందుకు ఎంపీ అర్వింద్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కొత్త రైళ్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి జేఏసీ నాయకుడు శివకుమార్ రైల్వేశాఖ అధికారులను కలిసి సమస్యలపై వినతి పత్రం అందించారు. సికింద్రాబాద్ రైల్వే శాఖ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ గతిశక్తి, సీనియర్ డివిజనల్ కమ్యూనికేషన్ మేనేజర్ ఏకే సింగ్, మెకానికల్ ఇంజినీర్ అహ్మద్ పాల్గొన్నారు.



గోడపై ఉన్న పార్టీ వాల్‌పెయింట్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ముసుగు పడింది

ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన మరుక్షణం నుంచే అధికారయంత్రాంగం రంగంలోకి దిగింది. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించిన మున్సిపల్ సిబ్బంది, జిల్లా కేంద్రంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు కప్పారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు వస్త్రం చుట్టిన మున్సిపల్ సిబ్బంది

క్లుప్తంగా

అల్పాహార పథకం పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని నవనాథపురం పాఠశాలలో అల్పాహార పథకాన్ని సోమవారం డీఈవో దుర్గాప్రసాద్ పరిశీలించారు. మెనూ ప్రకారం టిఫిన్లు పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

22 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

సుభాష్‌నగర్: జిల్లాలో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న 22 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో తొమ్మిది మందిని జగిత్యాల జిల్లాకు అలాట్ చేసినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఇటీవల సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చిన విషయం తెలిసిందే.

వర్సిటీ విద్యార్థులకు శిక్షణ తరగతులు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ కాలేజీలో వర్సిటీ విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. కో–ఆర్డినేటర్ మహమ్మద్ అతీక్ సుల్తాన్ ఘోరీ ఆధ్వర్యంలో మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ ట్రైనింగ్ అకాడమీ సౌజన్యంతో స్కిల్, నాలెడ్జ్ అంశాలపై ఈ నెల 14వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ట్రైనర్ శ్రీహరి శిక్షణనిస్తున్నారు.

ఉర్దూ హెచ్‌వోడీగా మూసా ఖురేషీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా ప్రొఫెసర్ మహమ్మద్ మూసా ఖురేషీ నియామకమయ్యారు. సోమవారం తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి తన ఛాంబర్‌లో ఖురేషీకి ఉత్తర్వులు అందజేశారు.

దిల్‌రాజుకు పితృ వియోగం



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి వాసి, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తండ్రి శ్యాం సుందర్ రెడ్డి (86) సోమవారం రాత్రి హైదరాబాద్‌లో పరమపదించారు. ఆయన నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లి (ఉమ్మడి ముదక్‌పల్లి)కి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో దహన సంస్కారాలు నిర్వహించనున్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 140 వినతులు



కలెక్టరేట్‌కు వచ్చిన ఎరుకల సంఘం నాయకులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 140 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీపీవో జయసుధ, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

తెలంగాణ ఎరుకల సంఘానికి ఎరుకల సాధికారత పథకం ద్వారా రెండెకరాలు ప్రభుత్వ స్థలం కేటాయించాలని కుర్రు తెలంగాణ ఎరుకల (గిరిజన) హక్కుల ఐక్య పోరాట సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ పట్టణంలో 2017లో పందుల పెంపకందారుల సహకార సంఘం కమిటీని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గతంలో నిధులతోపాటు జిల్లాకేంద్రంలో స్థలం కేటాయిస్తున్నట్లు తెలియజేశారని, ఆ మేరకు వెంటనే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సుబ్బయ్య, సాయిలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఖలీల్‌వాడి: మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. రాజేశ్వర్, గోవర్ధన్, శివకుమార్ కిరణ్, కళావతి, నవనాథ్, నర్సింగరావు, రజిని, రవి, యాదమ్మ, తిరుపతి, సైదులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లు చెల్లించాలని, గౌరవ వేతనం రూ.మూడు వేలు ఇవ్వాలని, అల్పాహారానికి సరిపడా సరుకులను సరఫరా చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి, తుకారం నాయక్, సురేందర్ రెడ్డి, సుజాత, లక్ష్మి, నిరంజన పాల్గొన్నారు.

ధరణి లోపాలు.. రైతులకు శాపాలు

- పూర్తిస్థాయిలో ఆప్షన్‌లు లేక పరిష్కారం కాని భూ సమస్యలు
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు



కొట్టె నారాయణ, ఏర్గట్ల

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్లకు చెందిన కొట్టె నారాయణకు 242ఓ సర్వే నంబర్‌లో పద మూడున్నర గుంటల భూమి ఉంది. 326అబీ సర్వే నంబర్‌లో ఏడు గుంటలకు పైగా భూమి ఉంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌లు నారాయణ వద్ద ఉన్నాయి. అలాగే 2016 వరకు రాసి ఉంచిన మ్యానువల్ పహాణీలోను కొట్టె నారాయణ పేరు మీద భూమి వివరాలు నమోదు చేసి ఉన్నాయి. అయితే 2018లో కొత్తగా డిజిటల్ పాస్‌పుస్తకాలను తెలంగాణ ప్రభుత్వం జారీ చేయగా నారాయణ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో అతనికి డిజిటల్ పాస్‌పుస్తకం జారీ కాలేదు. ఆన్‌లైన్‌లో తనిఖీ చేస్తే కొట్టె నారాయణ పేరు మీద ఉన్న భూమి ఇతరుల పేరుపై నమోదు చేసి ఉంది. నారాయణకు సంబంధించిన భూమిలో అతని కుటుంబ సభ్యులే వ్యవసాయం చేస్తున్నా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఇతరుల పేరుమీద ఉంది. ఫలితంగా ఇంత వరకు నారాయణకు రైతుబంధు మంజూరు కాలేదు. తన సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరిగినా పరిష్కారం కాలేదు. ఇలా అనేక మంది చిన్న సన్నకారు రైతులు భూముల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారు. ధరణి పోర్టల్‌లో భూముల సమస్యలను పరిష్కరించడానికి ఆప్షన్‌లను ఇవ్వకపోవడంతో జిల్లాలో అనేక మంది వ్యవసాయం చేస్తున్నా పెట్టుబడి సాయానికి నోచుకోవడం లేదు. ప్రతి మండలంలో వంద నుంచి రెండు వందల దరఖాస్తులు ధరణిలో ఆప్షన్‌లు రాని కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం.

ధరణిలో ఆప్షన్లు ఇస్తేనే

ధరణి వెబ్ పోర్టల్‌లో ఆప్షన్లను పూర్తి స్థాయిలో ఇస్తేనే భూముల సమస్యలు పరిష్కరించి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. గతంలో జారీ చేసిన పట్టా పాసు పుస్తకాలు రైతుల వద్ద ఉన్నా కొందరు ఉద్యోగులు చేసిన తప్పిదాలతో అనేక మంది రైతులు తమ భూములపై హక్కులను కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరణిలో అన్ని ఆప్షన్లను ఇచ్చి భూముల సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

కబ్జాకాలం తొలగింపుతో..

కొత్త రెవెన్యూ చట్టం అమలు కాక ముందు పహణీలలో పట్టాదారు కాలంతో పాటు కబ్జా కాలం ఉండేది. ఎవరైనా భూమిని కొనుగోలు చేసుకుని సాగు చేసుకుంటే పట్టా మార్పిడి జరుగకపోయినా కబ్జా కాలంలో సంబంధిత రైతు పేరును నమోదు చేసేవారు. కొత్త రెవెన్యూ చట్టం అమలు ద్వారా కబ్జా కాలాన్ని ప్రభుత్వం తొలగించింది. క్షేత్ర స్థాయిలో ఉన్న భూమిని సదరు రైతు కబ్జాలో ఉన్నా ఆ కాలమ్ లేకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారులదే పైచేయిగా మారింది. కబ్జా కాలం తొలగింపుతో అనేక మంది రైతులు నష్టపోయారు. పట్టాదారు ఒక్కరి పేరు రికార్డుల్లో ఉండేసరికి వారు భూమి విక్రయించినా పట్టా మార్పిడి జరగకపోవడంతో చిన్న సన్నకారు రైతులకు ముప్పు వాటిల్లేలా ఉంది.

మెడికల్ షాపుల నుంచి వసూళ్లు!

- ఒక్కో దుకాణం నుంచి రూ.3వేలు



మోర్తాడ్(బాల్కొండ): మెడికల్ దుకాణాల నుంచి మామూళ్ల పేరుతో భారీ మొత్తంలో వసూళ్లకు కొందరు దళారులు తెరతీశారు. డ్రగ్స్ విభాగం అధికారులకు ముడుపులు ఇవ్వాల్సి ఉందని ఇందుకోసం ఒక్కో దుకాణం నుంచి రూ.3వేల చొప్పున అసోసియేషన్ ప్రతినిధులుగా చెప్పుకుంటున్నవారు వసూలు చేస్తున్నారని సమాచారం. జిల్లాలో దాదాపు 2,400 మెడికల్ దుకాణాలు ఉన్నాయి. ఆరు నెలలకు ఒకసారి ఇదే విధంగా వసూలు చేస్తున్నారని తెలుస్తుంది. ఒక ఏడాదిలో రూ.1.44 కోట్లను మామూళ్ల కింద వసూలు చేస్తున్నారని సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో రూ.3 వేల చొప్పున వసూలు చేసినా.. పట్టణ ప్రాంతాల్లో ముడుపుల సొమ్ము విలువ ఎక్కువే ఉంటుందనే వాదన వినిపిస్తోంది. డ్రగ్స్ విభాగం అధికారులు నేరుగా వసూలు చేయకుండా మెడికల్ దుకాణాల యూనియన్ ఆధ్వర్యంలో తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామూళ్లు ఇవ్వకుంటే డ్రగ్స్ అధికారులు తనిఖీల పేరిట వేధిస్తారని పలువురు మెడికల్ షాపుల యజమానులు తెలిపారు.

విచారణ జరుపుతాం

మెడికల్ దుకాణాల నుంచి అసోసియేషన్ ప్రతినిధులు మామూళ్ల పేరిట వసూలు చేసిన విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరిపిస్తాం. వాస్తవాలు తెలుసుకుని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. మేము ఎవరిని డబ్బులు అడగలేదు.
– శ్రీలత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్

అపూర్వ సమ్మేళనం



పిప్రిలో సమావేశమైన 2000-01 బ్యాచ్ విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలోని గురడి రెడ్డి కాపు ఫంక్షన్ హాల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వేదికైంది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సమ్మేళనానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు నర్సింగ్‌రావు, శకుంతలరెడ్డి, ఇందిర, సరోజిని, గంగాధర్, విద్యార్థులు రవీందర్, నర్సింహచారి, రఘు, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, రాజేంద్రప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంథని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు



మంథనిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆర్మూర్ మండలం మంథని ప్రాథమికోన్నత పాఠశాలలో 1987లో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు గాదెపల్లి నర్సారెడ్డి, నక్కల చిన్నారెడ్డి, గంగారాం, బూస మల్లయ్య, నవీద్ ఖాన్, మురళి గౌడ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుదర్శన్

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ అర్బన్: దేశ యువతలో ఇటీవల మాదకద్రవ్యాల వాడకం పెరిగిందని డీఎంహెచ్‌వో సుదర్శనం అన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. సోమవారం నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వాడకంతో శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. వీటి నివారణకు నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం, సూర్య ఆరోగ్య సంస్థ, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో 'ఓ మై ఫ్రెండ్' పేరిట సమగ్ర వ్యూహాన్ని రూపొందించామన్నారు. అడిషనల్ కమిషనర్ జయరాం, వైద్యులు రాజేంద్రకుమార్, డాక్టర్ విశాల్, నిశిత కాలేజీ చైర్మన్ నిఖిల్, కో ఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



పెరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల జీతం

- రూ.8,900 నుంచి రూ.11,570కు పెంపు
- జిల్లాలో 320 మందికి లబ్ధి

డొంకేశ్వర్(ఆర్మూర్): ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెరిగాయి. రూ.8,900 నుంచి రూ.11,570కి పెంచుతూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోని 320 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు లబ్ధి చేకూరనుంది. వేతనాలు పెంచి తమను రెగ్యులర్ చేయాలని చాల కాలంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నారు. కానీ ప్రభుత్వం రూ.2,670 (30శాతం) పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞలు తెలియజేశారు.

విద్యుత్ ఏపీటీఎస్ సీఐ బదిలీ

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖ ఏపీటీఎస్ సీఐ సురేష్ బదిలీ అయ్యారు. విద్యుత్ శాఖలో నిధులు దుర్వినియోగంపై గతంలో 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ ఘటనపై ఆయన విచారణ సక్రమంగా చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు సీఐగా వచ్చి సుమారు ఐదేళ్లు అయింది. దీంతో ఆయనను హైదరాబాద్ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ ఏపీటీఎస్ సీఐగా జనార్దన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో హుజురాబాద్‌లో విధులు నిర్వహించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె వాయిదా



మాట్లాడుతున్న నాయకులు

ఖలీల్‌వాడి: మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను జిల్లాలో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, ఎండీఎం కార్మిక యూనియన్ కార్యదర్శి చక్రపాణి సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, డీఈవో కమిషనర్‌తో మాట్లాడి పెంచిన వేతనం అమలు చేస్తామని చెప్పడంతో పాటు, సెప్టెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వస్తాయని హామీనివ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తమ అకౌంట్‌లోకి డబ్బులు వచ్చే వరకు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలుపుతామన్నారు. జిల్లా అధ్యక్షురాలు బైరి సాయమ్మ, నాగలక్ష్మి, ఉమా, భూమయ్య, గంగాధర్, బాలరాజు, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డ్రెయినేజీలో పడిన ఆటో



తాడ్వాయి: తాడ్వాయిలో సోమవారం ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. రోజు మాదిరిగానే కల్లు డిపో నుంచి కల్లు సీసాలను తీసుకొని వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి డ్రెయినేజీలో పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

తక్కువ ధరకు బంగారం అని మోసం

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు

నిజామాబాద్‌రూరల్: తక్కువ ధరకే బంగారం అమ్ముతానని మోసం చేస్తున్న నిందితుడు అన్వర్‌ను పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన అన్వర్ తక్కువ ధరకే బంగారం అమ్ముతానని ప్రజలకు మాయమాటలు చెప్పాడు. దీంతో ఎంతోమంది నిందితుడికి డబ్బు చెల్లించారు. ఇలా రూ.కోట్లు వసూలు చేసిన అన్వర్ పలువురికి నకిలీ బంగారం అంటగట్టాడు. మరికొంత మందికి రేపు మాపు అంటూ సాగదీశాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన పలువురు రూరల్ పోలీస్ స్టేషన్‌లో గతంలో ఆశ్రయించగా అన్వర్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిర్మల్, జగిత్యాల జిల్లాలో కూడా అన్వర్ బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. అన్వర్ పేరు మీద బినామీ ఆస్తున్నట్లు సమాచారం.

ఒకరిపై చీటింగ్ కేసు

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్‌లో కిరాణ దుకాణం యజమానిని మోసగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం తెలిపారు. రాజశేఖర్ దుకాణంలో ఓ వ్యక్తి రూ.540 విలువ చేసే ఆయిల్ ప్యాకెట్లను కొనుగోలు చేశాడు. రాజశేఖర్ భార్య షాపులో ఉండడంతో ఫోన్ పేతో డబ్బులు చెల్లిస్తానని నమ్మించాడు. కానీ తన అకౌంట్‌లోకి డబ్బులు పంపించుకున్నాడు. ఆమె భర్తకు ఫోన్ చేయగా డబ్బులు జమ కాలేదని చెప్పాడు. అంతలోగా నిందితుడు పారిపోయాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



నవనీత (ఫైల్)

భిక్కనూరు: భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓడ్డెం నవనీత (24) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. వివరాలు.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన నవనీత భిక్కనూరు ఠాణాలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆమె కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతోంది. చికిత్స తీసుకుంటునే విధులు నిర్వహిస్తోంది. సోమవారం విధుల్లో భాగంగా నిజామాబాద్‌కు బస్సులో వెళ్తుండగా సదాశివనగర్‌కు చేరుకోగానే అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైంది. బస్సులో ఉన్న ప్రయాణికులు బస్సు నిలిపి 108కి సమాచారం అందించారు. వాహనం రాగానే అందులో నవనీతను కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలికి తండ్రి పెద్దనర్సింలు, తల్లి లక్ష్మి, సోదరుడు నరేశ్ ఉన్నారు. ఎస్సై సాయికుమార్‌తో పాటు పోలీసులు నవనీత మృతి పట్ల సంతాపం తెలిపారు.

నగరంలో మహిళ హత్య



లలిత (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని నాందేవ్‌వాడలో నివాసం ఉంటున్న బుక్యా లలిత(50) హత్యకు గురైంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన బుక్యా లలిత ఏడాది నుంచి నగరంలోని ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో పని చేస్తూ.. నాందేవ్‌వాడలో ఒంటరిగా ఉంటోంది. రెండు రోజులుగా లలిత ఫోన్ కలవకపోవడంతో సోమవారం ఉదయం ఆమె కూతురు వచ్చి చూడగా ఇంటికి తాళం ఉంది. దీంతో ఆమె మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇంటికి వెళ్లి చూశారు. ఏవైనా ఆధారాలు దొరుకుతాయని తాళం పగులగొట్టి చూడగా లలిత మృతదేహం నగ్నంగా ఉంది. రెండు రోజుల క్రితం చనిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శనివారం ఆమె ఎవరితోనో కలిసి ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే మహిళ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని అధికారులు గుర్తించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ నరహరి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. పాల్వంచ మండలం భవానిపేట తండాకు చెందిన బానోతు శీను (45) భార్య రేణు కూతుర్లు కీర్తన, సువర్ణతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. తన భార్యకు కంటి సమస్య ఉండడంతో వైద్య పరీక్షల నిమిత్తం కామారెడ్డికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. ఘన్‌పూర్ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో కిందపడిన శ్రీను తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

నాగిరెడ్డిపేట: గుడికి వెళ్తున్నాని ఇంటి నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన మణిగిరి పోచమ్మ(47) గుడికి వెళ్తున్నాని చెప్పి ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పోచమ్మ కోసం ఆమె కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోచమ్మ కుమార్తె భాగ్యలక్ష్మి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. నలుగురుని అదుపులోకి తీసుకొని రూ.29,770 సీజ్ చేశామన్నారు.